క్లుప్తంగా

సమస్యలపై పోరాటానికి రైతులు సహకరించాలి

కాజులూరు: సమస్యలపై పోరాటాలు చేసే సమయంలో సంఘాల రైతులు తమ వంతు సహకారాలు అందించాలని జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. బుధవారం రాజబాబు తదితర నాయకులు మండల గ్రామాలలో పర్యటించి గురువారం కాకినాడలో జరిగే ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొనాల్సిందిగా రైతులను ఆహ్వానించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఏమి పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో దేశవ్యాప్త ట్రాక్టర్ల ర్యాలీలో భాగంగా కాకినాడలోనూ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుడుపూడి భూచక్రం, వనుం వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం ఎంతో అవసరం

రామచంద్రపురం: విద్యార్థులు చదువుతో పాటుగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఇరవాడ వసంతలక్ష్మి అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఏర్పాటుకు విచ్చేసిన ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చెడు అలవాట్లకు విద్యార్థి దశలో దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ల జోలికి పోకుండా నిత్యం చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలకు అందుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్‌రావు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు స్థలాల కేటాయింపు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం పంచాయతీ పరిధిలో దేవాలయాల నిర్మాణాలకు స్థలాలను కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసింది. తీర్మాన కాపీలను బుధవారం సర్పంచ్ ఆరిఫ్ చేతుల మీదుగా ఆలయాల కమిటీ పెద్దలకు అందజేశారు. గ్రామంలో కోదండ రామాలయం నిర్మాణానికి రెండో వార్డు ఎరుకుల వీధిలో పంచాయతీ స్థలం నుంచి నాలుగు సెంట్లు కేటాయించారు. అలాగే బూర్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమగుండం చెరువు వద్ద నాలుగు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ తీర్మాన కాపీని ఆలయ కమిటీ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వార్డు సభ్యుడు నున్న గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు ధూళిపూడి వెంకటేశ్వరరావు, పులగం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ పరీక్షలో గిప్సన్‌కు తృతీయ స్థానం



గిప్సన్‌కు నగదు, జ్ఞాపిక అందిస్తున్న క్లబ్ నిర్వాహకులు

కె.గంగవరం: క్రిస్టియన్ యూత్ క్లబ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త బైబిల్ పరీక్షలో పేకేరు గ్రామానికి చెందిన ఎం.గిప్సన్‌కు తృతీయ స్థానం సాధించాడు. ఇటీవల ఆకివీడులోని సెంట్రల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన బైబిల్ పరీక్షకు వందల సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో తృతీయ స్థానం సాధించిన గిప్సన్‌కు రూ.5 వేలు నగదు, మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమం పేకేరులోని బేతేల్ ప్రేయర్ చర్చ్ పాస్టర్ సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగింది.

కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

రామచంద్రపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రిచిట్టి బాబు అన్నారు. పట్టణంలోని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్రరావు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ వచ్చేనెల రాజోలులో జరిగే జిల్లా కార్యవర్గ సమావేశానికి బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. పట్టణానికి చెందిన కాండూరి పవన్ ఆదిత్య పార్టీలో చేరగా ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు కండువాను వేసి ఆహ్వానించారు. పార్టీ నేతలు యాండ్ర బుల్లాబ్బాయి,కొట్టువాడ హరిబాబు, నాగార్జున, పులిగడ్డ సురేష్‌కుమార్, వాసంశెట్టి నాగేశ్వరరావు మాధవభట్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనాలు

రామచంద్రపురం రూరల్: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని విద్యార్థులు తయారు చేసిన ఆకృతులు ఆకట్టుకున్నాయి. హసన్‌బాద హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వింధ్య విహారి, మహాలక్ష్మి సాయిశ్రీ, శంకరశ్రీ, కీర్తన రిషిత తయారు చేసిన క్రాఫ్ట్ నమూనాలు పాఠశాలలో బుధవారం ప్రదర్శించారు. వారిని ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.



ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి

- పూర్తి పారదర్శకంగా సేకరణ
- రెండు నియోజకవర్గాల్లో 1,00,667 ఎకరాల్లో వరి సాగు
- 1,68,619 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 90 శాతం రైతులకు ఇప్పటికే చెల్లింపులు
- దళారులు, మిల్లర్ల ప్రమేయానికి అడ్డుకట్ట
- దోహదపడిన ఆర్‌బీకే, వలంటీర్ వ్యవస్థలు



అంగరలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆనందకుమారి (ఫైల్)

కపిలేశ్వరపురం: సాంకేతిక సమస్యల వల్ల తలెత్తిన కొద్దిపాటి ఇబ్బందులు మినహా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. మిగిలిన కొద్దిపాటి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఫిబ్రవరిలో కూడా ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ధాన్యాన్ని విక్రయించిన రైతుల్లో 90 శాతం మందికి ప్రభుత్వం చెల్లింపులు సైతం పూర్తి చేసింది. గత ప్రభుత్వాల హయాంలో ధాన్యం విక్రయాలు అక్రమాలు, అవినీతికి ఆనవాలుగా మారేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మిల్లర్లు, దళారీల ప్రమేయాన్ని కట్టడి చేసేలా ధాన్యాన్ని కొనుగోలు కార్యక్రమాన్ని శాస్త్రీయంగా రూపొందించింది. అందుకోసం పూర్తి సాంకేతికతను సద్వినియోగం చేసుకుంది. గత ప్రభుత్వాల కాలంలో ధాన్యం నాణ్యత బాగోలేదని, మార్కెట్‌లో రేటు లేదని, మిల్లర్లు కొనడం లేదంటూ దళారీల రాజ్యం కొనసాగేది. దాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం సాగు ప్రక్రియ తొలి నుంచీ శాస్త్రీయ విధానాన్ని అమలు చేసింది. దీంతో దండా కట్టడి అయి ధాన్యం పారదర్శకంగా అమ్మకాలు పూర్తయ్యాయి.

మండలాల వారీగా ధాన్యం కొనుగోలు ఇలా...

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	రైతులు	సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నులు)	సేకరించిన ధాన్యం (మెట్రిక్ టన్నులు)
రామచంద్రపురం	18,806	9,737	28,600	27,678
కె.గంగవరం	15,656	8,700	30,000	28435
కాజులూరు	18,787	17,200	28,280	28,200
మండపేట	16,892	11,042	36,000	30,296
రాయవరం	14,646	12,002	30,000	26,000
కపిలేశ్వరపురం	15,880	7,200	28,467	28,010
మొత్తం	1,00,667	65,881	1,81,347	1,68,619

పెంచిన గిట్టుబాటు ధరతో రైతుకు మేలు

పంట సాగు దశలో ఉండగానే ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరను ప్రకటించింది. ఎ గ్రేడ్ రకం క్వింటా ధర రూ.1,960 నుంచి 2,060కు, సాధారణ రకం క్వింటా ధర రూ.1,940 నుంచి 2,040కి పెంచింది. దీంతో రైతుకు బస్తాకు రూ.100 చొప్పున అదనంగా దక్కింది.

పారదర్శకంగా కొనుగోలు



"రైతు సాగు ప్రక్రియను ప్రారంభించిన నాటి నుంచి క్షేత్రస్థాయి వ్యవస్థలను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. వారి ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం.ఆర్‌బీకే, వలంటీర్ల శ్రమ, రైతుల సహకారంతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగింది."
–వి.అశోక్, ఏఓ, కాజులూరు

కలిసొచ్చిన ఆర్‌బీకే, వలంటీర్ వ్యవస్థలు..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకే, వలంటీర్ వ్యవస్థలు పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లకు అనుకూలించాయి. రైతు భరోసా కేంద్రాలనే కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేసి అక్కడకు మిల్లర్లను దరిచేర నివ్వకుండా మిల్లు వద్దనే కస్టోడియన్‌ను నియమించింది. వలంటీర్ ద్వారా రైతు తన ధాన్యంను ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసుకోగా మిల్లు వద్ద వ్యవహారాలను కస్టోడియన్ చూసుకున్నాడు. దీంతో దళారీ, మిల్లర్లను కలవాల్సిన అవసరం రైతుకు లేకుండా నూతన పద్ధతి దోహదపడింది. ఇది నచ్చని దళారీలు తమకు సంప్రదించిన రైతులను గందరగోళ పరుస్తూ ఇబ్బందులకు గురి చేసినట్టు క్షేత్ర స్థాయ పరిశీలనలో తేలింది. అలాంటి పరిస్థితుల్లో వ్యవసాయాధికారులు రైతులను చైతన్య పరచి పారదర్శక కొనుగోలుకు దోహదపడ్డారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెంటూరులో గడప గడపకూ..



వెంటూరులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని వెంటూరులో బుధవారం మధ్యాహ్నం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుతున్న ప్రభుత్వ పథకాలు ఏ మేరకు లబ్ధిదారులకు ఆనందాన్నిస్తున్నాయో తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాల్సిందిగా తమకు సూచించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న ప్రదీప్‌కృష్ణకుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి రవికుమార్, రాష్ట్ర పోలీసు వేర్ హౌస్ సభ్యురాలు వాసంశెట్టి అనంతలక్ష్మి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో దళారీ వ్యవస్థకు చెల్లుచీటి

అండ్రంగి గడప గడపకూ కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ



అండ్రంగిలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: టీడీపీ హయాంలో పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లుచీటి పలికారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అండ్రంగిలో మంత్రి వేణుగోపాలకృష్ణ బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతుందీ లేనిదీ ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని అందరికీ వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పలు సమస్యలను ప్రజలు మంత్రి వేణు దృష్టికి తీసుకు రాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి మురళి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి నాగసుజాత, ఎంపీటీసీ సభ్యురాలు మట్టా వెంకటరమణమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సమనాశి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: మహిళా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతీ మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. మెప్మా ప్రాజెక్టు టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ టి.ఆనంతలక్ష్మి అధ్యక్షతన బుధవారం స్థానిక డొక్కా సీతమ్మ భవన్‌లో జరిగిన పట్టణ సమాఖ్య మహాజన సభకు చైర్ పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ మహిళ సమాఖ్య నూతన కోశాధికారిగా పేరూరి మాధవిని ఎన్నుకున్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, జంగం కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మున్సిపల్ మేనేజర్ టి. కనకరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జాతరలు మన సంస్కృతిలో అంతర్భాగం



ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిలను సత్కరిస్తున్న కొప్పు వెలమ సంక్షేమ సంఘ నేతలు

రాయవరం: జాతరలు, గ్రామ దేవతల ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాయవరంలో కొప్పు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలమ్మ అమ్మవారి జాతరలో బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారిద్దరూ మాట్లాడుతూ ఏటా పోలమ్మ జాతరను ఘనంగా కమిటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కొప్పు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు, డాక్టర్ సూర్యనారాయణరెడ్డిలను దుశ్శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ తేతల సుబ్బరామారెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో కొప్పు వెలమ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



సీనియర్ ఓటర్‌ను సత్కరించిన ఆర్డీవో సింధూ సుబ్రహ్మణ్యం తదితర అధికారులు



మండపేట ర్యాలీలో తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ రాజు తదితరులు

కె.గంగవరం: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో విద్యార్థులతో ఎంపీపీ పంపన నాగమణి, రెవెన్యూ సిబ్బంది ప్లకార్డులు నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి, తహసీల్దార్ వైద్యనాథశర్మ, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ప్రలోభాలకులోను కాకుండా ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. పలు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది సీనియర్ ఓటరును పూలదండలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్థానికంగా గల పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అముజూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొని ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి సీనియర్ ఓటర్లను సన్మానించారు.

కాజులూరు: మండల గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దారు బి.సాయిసత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి మహిళలచే ర్యాలీలు నిర్వహించారు. కాజులూరు, గొల్లపాలెం తదితర గ్రామాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దారు ప్రతిజ్ఞ చేయించారు. పలువురు సీనియర్ ఓటరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ తెలగాకాపు సంఘం నాయకుడు యాళ్ళ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: ప్రజాస్వామ్యం మనుగడ ఓటు హక్కు పునాదులపై ఉందని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఎంపీపీ వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులను తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో సత్కరించారు. అలాగే లొల్ల, వి.సావరం, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో వీఆర్వోల ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మండపేట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండపేట అర్బన్, మండల గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు, ఎంపీడీఓ ఐ.రాజు, మున్సిపల్ మేనేజర్ తాతపూడి కనకరాజు తదితరులు హాజరయ్యారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీటీ పీపీ మెహర్‌బాబా, మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో క్షేత్ర స్థాయిలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కపిలేశ్వరపురంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసీల్దార్ కొమరం సూర్యారావు మాట్లాడుతూ ఓటు హక్కు బలమైన ప్రజాస్వామ్యపు ఆయుధమన్నారు. 19 గ్రామాల్లో వీఆర్వోలు ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. విద్యార్థులు ప్రతిభా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులనందించారు.

రామచంద్రపురం రూరల్: అన్నయపేట పంచాయతీ వద్ద సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రావూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పెమ్మిరెడ్డి మురళీ, కృష్ణ పంచాయతీ సిబ్బంది తదితరులు ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యను పలువురు తెలియజేశారు.

రామచంద్రపురం: దేశ ప్రజాస్వామ్య విశిష్టతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఏటా కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందని రామచంద్రపురం ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్స్‌ను ఘనంగా సత్కరించారు. డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండల తహసీల్దార్‌లను ఆర్డీవో సత్కరించారు. కొత్తగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్



వెల్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా ప్రజా పరిషత్ నుంచి వచ్చిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ప్రజాప్రతినిధులు బుధవారం విద్యార్థులకు అందజేశారు. పాఠశాలలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. కీర్తి స్పందన, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంతగడ విజయప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ఎనలేనిదని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. మండలంలోని నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బుధవారం టెన్త్ విద్యార్థులకు జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ , ఎంపీటీసీ సభ్యురాలు గుడేల మధుకుమారి, హెచ్ఎం లక్ష్మి పాల్గొన్న కార్యక్రమంలో ఎంఈఓ కె.తాతారావు మాట్లాడుతూ పాఠశాలలో తెలుగు మీడియం విద్యార్థులు 296, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 299 మొత్తం 595 మంది టెన్త్ విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల సాగునీటి సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండల పరిధిలోని హైస్కూల్ పాఠశాలల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పదో తరగా స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేయనున్నట్టు ఎంఈఓ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌ల చేతుల మీదుగా మెటీరియల్ అందిస్తామన్నారు.

నూతన రథం నిర్మాణ పనుల పరిశీలన



రథం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి సంకల్పంతో నూతన రథ నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆలయ ప్రాంగణంలో తయారు చేస్తున్న రథం నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీన కల్యాణోత్సవం అనంతరం జరిగే రథోత్సవానికి నూతన రథంపై స్వామివారిని చూసేందుకు భక్తులు ఎదురు చూస్తున్నారని, స్వామివారి సంకల్పంతో అది జరిగేలా ఏఓ తారకేశ్వరరావు, స్థపతి గణపతి ఆచార్యులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ తదితర పార్టీ నేతలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే ఉత్సవాలకు సన్నద్ధం

రాయవరం: గణతంత్ర ఉత్సవాలకు పాఠశాలలు ముస్తాబయ్యాయి. మండలంలోని పలు పాఠశాలల వద్ద బుధవారం విద్యార్థుల హడావుడి కన్పించింది. పలువురు విద్యార్థులు జెండాలను అంటించుకునే పనిలో ఉన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు కొందరు విద్యార్థులు డ్యాన్స్ ప్రాక్టీస్ చేశారు. రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకుని పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ఎంఈవో వై.సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం ఎనిమిది నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.శ్రీనివాసు కోరారు.

మాచరలో ఫ్యామిలీ ఫిజీషియన్

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మాచరలో వైద్య పరీక్షలు చేశారు. వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి పి.చంద్రమౌళి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. చిన్నారులు, కిశోర బాలికలను పరీక్షించి పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. శిబిరంలో వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందించారు.

ఎమ్మెల్యే వేగుళ్ల కోలుకోవాలంటూ ప్రార్థనలు

మండపేట: స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు త్వరగా కోలుకోవాలని కాంక్షిస్తూ ముస్లింలు బుధవారం ప్రార్థనలు నిర్వహించారు. ఇటీవల ఇంట్లో మెట్ల పైనుంచి దిగుతూ ప్రమాదవశాత్తు జారిపడిన ఘటనలో ఎమ్మెల్యే వేగుళ్ల కాలు విరిగిన విషయం విదితమే. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను చిన్న మసీదు ఇమామ్ మహమ్మద్ ఖాసీమ్ అన్సారీ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేశారు.

సారా రహిత గ్రామంగా చినద్వారపూడి

మండపేట: మండలంలోని ద్వారపూడి శివారు చిన ద్వారపూడి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా బుధవారం ప్రకటించారు. గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సెబ్ ఆలమూరు సీఐ కె శ్రీధర్ మాట్లాడుతూ సారా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, ఎస్ఐ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థులు



రిపబ్లిక్ డే ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

రామచంద్రపురం: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్‌లో గల మున్సిపల్ హైస్కూల్‌లో క్రీడా ప్రాంగణంలో రిపబ్లిక్ డే ఆకృతిలో కూర్చుని అబ్బుర పరుస్తూ తమ దేశ భక్తిని చాటుకున్నారు. పాఠశాలలో ఇండియా దేశ పటాన్ని రళ్ల రంగులతో తయారు చేశారు. హెచ్ఎం, ఎం.మాధవి, క్రాఫ్ట్ టీచర్ కె.కనకదుర్గ, డ్రాయింగ్ టీచర్ కె.మురళీబాలు పాల్గొన్నారు.

